మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ నివాళి

వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ రూరల్, జనవరి 11: మండలంలోని రామలక్ష్మీపురం గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు బెల్లంకొండ బ్రహ్మం తండ్రి వెంకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ శనివారం బ్రహ్మం నివాసానికి వెళ్లి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దొంతగాని అప్పారావు, కూచిపూడి మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శెట్టి సురేశ్‌నాయుడు, చిమిర్యాల మాజీ పీఏసీఎస్ చైర్మన్ ముత్తవరపు రమేశ్, తొగరాయి మాజీ సర్పంచ్ దొంగల లక్ష్మీనారాయణ, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే.ఉద్దండు, యూత్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు అన్నెం అంజిరెడ్డి, మండల నాయకులు బోసుబాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు గూండాగిరిని మానుకోవాలి

- బీఆర్ఎస్ పెన్‌పహాడ్ మండలాధ్యక్షుడు యుగంధర్

పెన్‌పహాడ్, జనవరి 11: యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిని ఖండిస్తున్నామని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దొంగరి యుగంధర్ అన్నారు. కాంగ్రెస్ నాయకులు గూండాగిరిని మానుకోవాలి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకుల అరాచకాలను ఆపకపోతే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. బీఆర్ఎస్ శ్రేణులు, పార్టీ కార్యాలయాల జోలికి వస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

కోదాడ రూరల్: బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ కోదాడ యువజన విభాగం అధ్యక్షుడు ఇమ్రాన్‌ఖాన్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ హామీలపై ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు నిలదీస్తుండడంతో సమాధానం చెప్పలేక ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

'హామీలపై ప్రశ్నించినందుకే దాడులు'

తుంగతుర్తి, జనవరి 11: యాదాద్రి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు తడకమళ్ల రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దాడిని ప్రజాస్వామ్య వాదులంతా ఖండించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత శాంతిభద్రతలు కరువయ్యాయని, దానికి నిదర్శనమే ఈ దాడి అని అన్నారు. ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా ప్రతిపక్ష నాయకులపై దాడులు చేస్తూ, అక్రమ కేసులు పెడుతూ కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు బొజ్జ సాయికిరణ్, గునిగంటి సతీశ్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ సమయపాలన పాటించడం లేదని ఆందోళన

ఆత్మకూర్.ఎస్, జనవరి 11: రేషన్ డీలర్ సమయపాలన పాటించడం లేదని ఆరోపిస్తూ మండలంలోని రామోజీ తండాలో ప్రజలు ఆందోళన నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి.. నశింపేట గ్రామ రేషన్ డీలర్ గత కొంతకాలంగా రామోజీ తండా ఇన్‌ఛార్జి డీలర్‌గా వ్యవహరిస్తున్నారు. అయితే, ఆయన సమయపాలన పాటించకుండా రాత్రిపూట వచ్చి బియ్యం ఇస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని శనివారం రాత్రి రామోజీ తండా ప్రజలు ఆందోళన చేపట్టారు. రోజంతా వివిధ పనులకు వెళ్లి రాత్రి సమయంలో వచ్చి బియ్యం తీసుకోవాలంటే ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బియ్యం కోసం లైన్‌లో నిలబడితే అర్ధరాత్రి అవుతుందని, పగటిపూట బియ్యం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

- జిల్లా కార్యదర్శి నాగార్జున్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మల్లు నాగార్జున్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, జనవరి 11: ఈ నెల 25వ తేదీ నుంచి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే సీపీఎం రాష్ట్ర మూడో మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి కోరారు. శనివారం స్థానిక ఎంవీఎన్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ మహాసభల్లో రైతులు, కార్మికులు, మహిళలు, విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అనేక తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లుతో పాటు ముల్కలపల్లి రాములు, మట్టిపెల్లి సైదులు, కోట గోపి తదితరులు పాల్గొన్నారు.

పండుగ పూట అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ లక్ష్మీనారాయణ

పాలకవీడు, జనవరి 11: సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు, బంధువుల ఇండ్లకు వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని, పోలీసులకు ముందస్తు సమాచారం అందించాలని ఎస్ఐ లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో భాగంగా పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఇండ్లల్లో ఎవరూ లేని సమయంలో చోరీలు జరిగే అవకాశం ఉందని, కాబట్టి విలువైన వస్తువులు ఉంచరాదని తెలిపారు. ఇంటి బయట కాకుండా లోపలి వైపు తాళం వేసే ఏర్పాట్లు చూసుకోవాలని, రాత్రి వేళల్లో ఇంటి బయట వెలుతురు ఉండేలా చూడాలన్నారు. వీలైతే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

18న కొత్తగూడెంలో ఇఫ్టూ విలీన సభ

మద్దిరాల: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మద్దిరాల, జనవరి 11: ఈ నెల 18వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రెండు ఐఎఫ్‌టీయూ(ఇఫ్టూ) కార్మిక సంఘాల విలీన సభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య కోరారు. శనివారం మండల కేంద్రంలో నాయకులతో కలిసి విలీన సభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐఎఫ్‌టీయూ ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు నాగెల్లి రాంనర్సయ్య, మరికంటి ఉపేందర్, బర్పటి శ్రీను, కళింగం, రమేశ్, ఉపేందర్, భాస్కర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్.ఎస్: మండల కేంద్రంలో ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విలీన సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు కనుకంట్ల సైదులు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు బోయిని నాగరాజు, చిత్తలూరి వెంకన్న, రాము, గిలకత్తుల మహేశ్, చిత్తలూరి నాగరాజు, కప్పల మైసయ్య పాల్గొన్నారు.

విలీన సభలను జయప్రదం చేయాలి..

గరిడేపల్లి: త్వరలో జరగనున్న పలు ప్రజా సంఘాల విలీన సభలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్‌కుమార్ కోరారు. మండల పరిధిలోని వెలిదండ గ్రామంలో శనివారం నిర్వహించిన ప్రజా సంఘాల బాధ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18వ తేదీన కొత్తగూడెం, 19న మహబూబాబాద్, 20న ఖమ్మం, 22న ఆలేరు, 24న మంచిర్యాల, 26న హైదరాబాద్‌లో విలీన సభలు జరగనున్నాయని, ప్రజా సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు పోటు లక్ష్మయ్య, ఉదయగిరి, కామళ్ల నవీన్, వి.నరసింహారావు, కామళ్ల శ్రీను, రవి, రాజేశ్వరి, కనకారావు, మాశెట్టి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం రైతుల ఆందోళన

చివ్వెంల – ముకుందాపురం రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

ఆత్మకూర్.ఎస్, జనవరి 11 : ఎస్సారెస్పీ కాల్వల ద్వారా గోదావరి జలాలు రాక పోవడంతో తాము యాంగిలో నాటిన వరి పొలాలు ఎండి పోతున్నాయని, వెంటనే సాగునీటిని అందించాలని కోరుతూ మండలంలోని రామోజీతండాతో పాటు పలు గ్రామాల రైతులు శనివారం ఆందోళన చేపట్టారు. ఎస్సారెస్పీ –22ఎల్ కెనాల్ వద్ద చివ్వెంల– ముకుందాపురం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ తాము ఆరు సంవత్సరాలుగా గోదావరి జలాలతోనే పంటలు పండించుకుంటున్నామన్నారు. కానీ ఈ సంవత్సరం నీరు సరిగా విడుదల చేయక అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాసంగి సీజన్‌కు వారబందీ విధానంలో నీళ్లు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం, ప్రస్తుతం నీటిని విడుదల చేయకపోవడంతో సాగు చేసిన వరి పొలాలు ఎండి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే గోదావరి జలాలు విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సుమారు 100 మంది రైతులు రోడ్డుపై గంటన్నర పాటు ఆందోళన చేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

'కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను విరమించుకోవాలి'

సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబు

సూర్యాపేట టౌన్, జనవరి 11: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లతో రానున్న రోజుల్లో కార్మికులకు అన్యాయం జరుగుతుందని, వాటిని విరమించుకోవాలని, రాష్ట్రంలో లేబర్ కోడ్‌లను అమలు చేయాలని చూస్తే కార్మికులు పోరాటాలకు సిద్ధమవుతారని సీఐటీయూ ఆలిండియా ఉపాధ్యక్షుడు ఎం.సాయిబాబు అన్నారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 25 లక్షల మంది కార్మికులు వివిధ వృత్తుల్లో పని చేస్తున్నారని, వారి సంక్షేమాన్ని తుంగలో తొక్కే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు సరి కావన్నారు. పాలకులు కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. 60 ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడికి నెలకు రూ.6 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వంగూరు రాములు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రామ్మోహన్‌రావు, ఆర్.కోటంరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ముదం శ్రీనివాస్, నాయకులు యల్క సోమయ్య, సీహెచ్.లక్ష్మీనారాయణ, అనంతుల మల్లయ్య, సోములు, లక్ష్మయ్య, ఉప్పలయ్య, గాలయ్య, జంగయ్య, సాగర్, రాములు, నాగేశ్వర్‌రావు, రమేశ్, బాలాజీనాయక్, రాజేశ్వరి, సుజాత, మంజుల పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది : సీఐ

కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ

నేరేడుచర్ల, జనవరి 11: క్రీడా పోటీలతో స్నేహభావం పెంపొందుతుందని హుజూర్‌నగర్ సీఐ చలమంద రాజు అన్నారు. మండలంలోని కల్లూరు గ్రామంలో రాజీవ్ అన్న యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర గ్రామీణ స్థాయి కబడ్డీ పోటీలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడుల కొణతం చిన్న వెంకటరెడ్డి, ఎస్ఐ రవీందర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు చలసాని శ్రీనివాసరావు, చలసాని ఫౌండేషన్ చైర్మన్ చలసాని రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

'గీత కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం'

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌గౌడ్

నూతనకల్, జనవరి 11: గీత కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని గీత పరివార సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తొట్ల ప్రభాకర్‌గౌడ్ విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో గీత కార్మికులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాటాడారు. రాష్ట్రంలో 2.50 లక్షల మంది గీత కార్మికులు ఉండగా కేవలం 10 వేల మందికి మాత్రమే కాటమయ్య రక్షణ కిట్లను ఇచ్చారని తెలిపారు. గీత కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే దహన సంస్కారాలకు రూ.25 వేలు అందించాలని, మరణించిన వారి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. మద్యం టెండర్లలో గీత కార్మికులకు 25 శాతం అవకాశం కల్పిస్తామని చెప్పారని గుర్తుచేశారు. గీత కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు మద్దెల రామ్మూర్తి, బూడిద మల్లయ్య, బండపెల్లి సాగర్, మారగాని వెంకటాచలం, బీసు రామచలంద్రు, పోడేటి యల్లయ్య, బిక్కి రవి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ల్యాబ్ నిర్మాణ పనులు ప్రారంభం

నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ప్రకాశ్, వైస్ చైర్‌పర్సన్ సరిత

నేరేడుచర్ల, జనవరి 11: స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో పీఎంశ్రీ పథకం నిధులు రూ.13 లక్షలతో ఏర్పాటు చేయనున్న సైన్స్ ల్యాబ్ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్ చైర్‌పర్సన్ అలక సరిత శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అమరారపు లలిత, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు నూకల సందీప్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, ఏఈ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫాతిమా షేక్‌కు నివాళి

నేరేడుచర్ల, జనవరి 11: దేశ తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతి వేడుకలను నేరేడుచర్లలో ముస్లిం మైనార్టీ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మైనార్టీ నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ నాయకులు రామస్వామి, చల్లా ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ బాషా, నాయకులు యూసుఫ్, హుస్సేన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలి'

మఠంపల్లి, జనవరి 11: ప్రతి ఒక్కరూ ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని సాగర్ సిమెంట్స్ వైస్ ప్రెసిడెంట్ ఎంవీ.రమణమూర్తి అన్నారు. జాతీయ రహదారి భద్రత వేడుకల్లో భాగంగా శనివారం పరిశ్రమ కార్మికులతో రహదారి భద్రతపై ఆయన ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో డీజీఎం హెచ్ఆర్ హేమంత్, పరిశ్రమ అధికారులు సుబ్రహ్మణ్యం, ఆనంద్‌రెడ్డి, వెంకటరెడ్డి, కొండలు తదితరులు పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: మండల కేంద్రం మేళ్లచెర్వులోని మైహోం ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో శనివారం జాతీయ రహదారి భద్రత వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రెసిడెంట్ వర్క్స్ , యూనిట్ హెడ్ ఎన్.శ్రీనివాసరావు, జీఎం నాగేశ్వరరావు, డీజీఎం సూర్యనారాయణ, మేనేజర్ వేణునాయుడు, ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు డప్పు కళాకారుడు సతీశ్

గరిడేపల్లి, జనవరి 11: మండలంలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు, జానపద సామ్రాట్ అవార్డు గ్రహీత అమరవరపు సతీశ్‌కు ఢిల్లీలో జనవరి 26న జరగనున్న గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు అవకాశం దక్కింది. అంతరించిపోతున్న డప్పు దరువుకు ప్రాణం పోస్తున్న డప్పు సతీశ్‌ను ఈ సందర్భంగా శనివారం పలువురు అభినందించారు.

కాల్వలో నవజాత శిశువు మృతదేహం

ఆత్మకూర్.ఎస్, జనవరి 11: మండల కేంద్రం సమీపంలోని ఎస్సారెస్పీ 22ఎల్ కాల్వలో శనివారం నవజాత మగ శిశువు మృతదేహం లభ్యమైంది. శిశువు మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు అధికారులకు సమాచారం అందించడంతో విషయం వెలుగు చూసింది. గుర్తు తెలియని వ్యక్తులు కాల్వలో పడేశారని స్థానికులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుంగతుర్తి, జనవరి 11: మండల పరిధిలోని పలు గ్రామాల్లో నేడు చెట్లకొమ్మలు తొలగించనున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ సురేందర్ శనివారం తెలిపారు. మండల పరిధిలోని తూర్పుగూడెం, గానుగుబండ, వెంపటి ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రెడ్డి సంఘం మండల కమిటీ ఎన్నిక

మద్దిరాల, జనవరి 11: రెడ్డి సంఘం మండల కమిటీని శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా ఎలిపెద్ది మల్లారెడ్డి, ఉపాధ్యక్షులుగా బద్దం సంజీవరెడ్డి, శేరి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గూడ వెంకట్‌రెడ్డితో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అదేవిధంగా రెడ్డి యువజన సంఘం మండలాధ్యక్షుడిగా ఏలేటి శ్యామ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా యెల్లు అశోక్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నల్ల మధు రెడ్డిని ఎన్నుకున్నారు.

స్వర్ణకారులపై పోలీసుల వేధింపులు సరికాదు

- విశ్వకర్మ సంఘం రాష్ట్ర నాయకుడు నరసింహాచారి

కోదాడ టౌన్, జనవరి 11: స్వర్ణకారులు, వెండి, బంగారం వ్యాపారులపై పోలీసుల వేధింపులు సరికాదని విశ్వకర్మ సంఘం రాష్ట్ర నాయకుడు కొండోజు నరసింహాచారి అన్నారు. శనివారం కోదాడలోని బులియన్ మర్చంట్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన విశ్వకర్మ చైతన్య సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పోలీసులు దొంగ బంగారం రికవరీ పేరిట స్వర్ణకారులను, వ్యాపారులను వేధించడం మానుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో పోలోజు అంజి, బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు సుందరి వెంకటేశ్వర్లు, ఉప్పల శ్రీనివాస రావు, కోదాడ నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ అనంతారపు బ్రహ్మం, కందుకూరి ప్రదీప శంకరాచారి పాల్గొన్నారు.

'ప్రభుత్వ పదవుల్లో అవకాశం కల్పించాలి'

నూతనకల్, జనవరి 11: కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్ సహా ఇతర పదవుల్లో బీసీలకు పెద్ద సంఖ్యలో అవకాశం కల్పించాలని బీసీ సంఘం నేత వీరబోయిన లింగయ్యయాదవ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రం నూతనకల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణ రాష్ట్ర జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలను కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు అణగదొక్కుతున్నారని ఆరోపించారు. బీసీ సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. బీసీలను చిన్నచూపు చూస్తే గాంధీభవన్ ముట్టడికి కూడా సిద్ధమని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు వేల్పుల రఘు, సాయి, రాజేశ్, వీరు, లక్ష్మణ్‌కుమార్, సిద్ధు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తే అంతర్జాతీయ స్థాయిలో పతకాలు

- గ్రామీణ ప్రాంతాల్లో వెయిట్ లిఫ్టింగ్ అథ్లెట్లకు కొదువ లేదు
- ప్రతిభను వెలికితీస్తే అద్భుతాలు సృష్టిస్తారు
- తెలంగాణ రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఖ్యాతి పాలడుగు

ఖ్యాతి పాలడుగు

కోదాడ, జనవరి 11: క్రీడాకారులను ప్రభుత్వాలు ప్రోత్సహిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలను సాధిస్తారని తెలంగాణ రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఖ్యాతి పాలడుగు అన్నారు. ప్రస్తుతం వెయిట్ లిఫ్టింగ్ శిక్షణకు ప్రభుత్వాల నుంచి ఆదరణ కరువైందని పేర్కొన్నారు. కోదాడ పట్టణానికి చెందిన ఆమె తన సొంత ఖర్చులతో కోదాడలోని తేజ టాలెంట్ పాఠశాలలో రెండు రోజుల పాటు ఓపెన్ తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌ను నిర్వహిస్తున్నారు. శనివారం పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా నమస్తే తెలంగాణతో మాట్లాడారు. తొలుత తాను హైదరాబాద్‌లో ఏడాది పాటు రమేశ్‌గౌడ్ అనే వ్యక్తి వద్ద వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ తీసుకున్నానని, తర్వాత స్వశక్తితో ఎదుగుతూ కఠోర శ్రమ చేశానని పేర్కొన్నారు. 2004లో అంతర్జాతీయ స్థాయిలో దక్షిణాఫ్రికాలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. 2005లో కేరళలో నిర్వహించిన ఆసియా పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో సిల్వర్ మెడల్, 2006లో ఆలిండియా యూనివర్సిటీ స్థాయిలో గ్వాలియర్‌లో నిర్వహించిన పోటీల్లో బంగారు పతకం సాధించడంతో పాటు రాష్ట్రస్థాయిలో అనేక పతకాలు సాధించినట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో వెయిట్ లిఫ్టింగ్ అథ్లెట్లకు కొదువ లేదని, వారి ప్రతిభను వెలికితీస్తే అద్భుతాలు సృష్టిస్తారని పేర్కొన్నారు. కోదాడలో తాము నిర్వహిస్తున్న పోటీలకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వంద మందికి పైగా హాజరయ్యారని వెల్లడించారు. వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి జిల్లాకు ఒక కమిటీని ఎంపిక చేస్తున్నామని పేర్కొన్నారు. గత మూడు నెలల నుంచి కోదాడ ప్రాంత అథ్లెట్లకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో తమ అథ్లెట్లు గౌరీ, విధయ, మహేశ్వరి, సన్ సిట్, యశ్వంత్ గౌడ్ పలు పథకాలు సాధించినట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నర్సిరెడ్డి కృషి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాములు

సమావేశంలో మాట్లాడుతున్న రాములు

కోదాడ టౌన్, జనవరి 11: వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.రాములు కోరారు. శనివారం కోదాడ యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం బాగుపడాలన్నా, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కావాలన్నా ఎమ్మెల్సీగా నర్సిరెడ్డిని ఆదరించాలని కోరారు. గత ఆరేళ్ల కాలంలో ఎమ్మెల్సీగా ఆయన ఎన్నో సమస్యల పరిష్కారానికి కృషి చేశారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, జిల్లా కార్యదర్శులు నాగేశ్వరరావు, పాండురంగాచారి, జ్యోతి, పూర్వ జిల్లా అధ్యక్షుడు ధనమూర్తి, జనార్ధన్, చందా శ్రీనివాసరావు, నక్క శ్రీనివాస్, ఆంజనేయులు, శ్రీనివాస్, సైదిరెడ్డి, రాంపల్లి శ్రీను, హమీద్ పాల్గొన్నారు.

'గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు'

మునగాల, జనవరి 11: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. కొత్త ముకుందాపురం గ్రామంలో పందిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైవీ రెడ్డి విజ్ఞాన గ్రంథాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకొని అన్ని గ్రామాల్లో దాతలు ముందుకొచ్చి గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని కోరారు. నిరుద్యోగ యువత కోసం నాగిరెడ్డి గ